

# కథా కౌముది

## బిడియస్తుడు

బోడపాటి రమేష్

అతను చిన్నతనం నుంచీ చాలా బిడియస్తుడు. నలుగురి ఎదుట మాట్లాడలేడు ఆడవాళ్ళతో అయితే అస్సలు మాట్లాడలేడు.కారణం పైన చెప్పినదే. అట్లా అని ఆడవాళ్ళని చూడగానే ఖంగారు పడటం , మాట తడబడటం లాటి అనవసరమైన లక్షణాలేమీ లేవు. (నీ కెలా తెలుసు అంటారేమో.అదంతే). అతను కల్పించుకుని  వాళ్ళతో సంభాషణ పెంచుకోడు.ఏదో అడిగిన దానికి ముక్తసరిగా సమాధానం చెప్పటం , అవతలికి వెళ్లిపోవటం జరుగుతుంది.

స్కూల్లో పిల్లలు అతన్ని ఈ విషయంలో ఆట పట్టిస్తూ ఉండేవారు. ఆడపిల్లలయితే వచ్చీరాని పమిటల మాటున నవ్వులు దాచుకునేవాళ్లు.ఒక రకంగా ఇది అతని మంచికే ఉపయోగపడింది.

“మీ అబ్బాయి కేమమ్మా నిక్షేపంగా ఉంటాడు. శ్రద్ధగా  చదువుకుంటాడు. ఈకాలం(?) పిల్లలలాగా ఆడపిల్లలతో పోచుకోలు కబుర్లు పెట్టుకోడు.”టూకీగా ఇది అతన్నిగమనించిన  ఆడవాళ్ళు ఇచ్చిన సర్టిఫికేట్.

తల్లి ఆ మాటలు విని మెచ్చుకోలుగా కొడుకుని చూసి మురిసిపోయేది.

దానితో అతనికి ఒక రకమయిన అభిప్రాయం ఏర్పడింది. ఆడవారితో మాట్లాడటం , తిరగటం లాంటివి చేస్తే తన చదువు గట్రా పాడయి పోతాయి. ఈ అభిప్రాయం వయసుతో పాటు పెరిగిపోయి ముదిరిపోయింది.

కాలేజీలో చదువుకునే రోజుల్లో కూడా అదే ధోరణి కొనసాగించాడు.వయసుతో పాటు వచ్చే చిలిపి భావాలు అతనిలో కలిగినా వాటిని అణచి వేసేవాడు. అతనితో మాట్లాడాలని కొందరు ఆడవాళ్ళు ప్రయత్నించేవాళ్లు.మొదట్లో సరదాగా తీసుకున్నా కొన్నాళ్లు పోయిన తర్వాత  అది పట్టుదలగా మారింది, ముఖ్యంగా అతని సహాధ్యాయి లలితకి.కలవారి అమ్మాయి. తొలిచూపులోనే ప్రేమించేయకపోయినా క్రమేపీ ఇతనిమీద మంచి అభిప్రాయం

ఏర్పరచుకుంది. ఒకటి,రెండు ప్రేమలేఖల్లాంటివి కూడా మంచి రోజు(?) చూసుకుని వ్రాసేసింది.అయినా అతనిలో చలనం లేదు.

ఒకరోజు కాలేజి కాంటిన్లో అతన్ని నిలదీసి,"ఏమండీ నా ఉత్తరాలు అందాయా?"ఆతృతగా ప్రశ్నించింది లలిత.

' ఆ... ఊ' అన్నాడేకానీ సరయిన సమాధానం ఇవ్వలేదు.

"ఏమండీ. నాతో మాట్లాడాలని అనిపించటం లేదా?"

" అబ్బే అదేం కాదు" తడబడ్డాడు.

"మరి" అని ఆమె రెట్టించటంతో అతనికి ఏం మాట్లాడాలో తెలీలేదు.

"ఓ నాకు తెలిసింది లెండి. నాతో మాట్లాడితే నోటి ముత్యాలు రాలిపోతాయని " గలగలా నవ్వేసింది.

"మీరట్లా అనటం బాగాలేదు.అయినా నాకు ఆడవాళ్ళతో మాట్లాడాలనిపించదు."

"హార్మోన్డఫిషియన్సీ"అతనికి వినబడీ వినబడకుండా అన్నది, కిసుక్కున నవ్వుతూ.

"ఏమిటంటున్నారు?" అన్నాడతను ఒకింత ఖంగారుగా.

"నా ఉత్తరాలకి సమాధానం రాయలేదేం?"

"మీరట్లా అడిగితే నేనేమీ చెప్పలేను అయినా ఆడపిల్లలు అట్లా ఉత్తరాలు రాస్తారా?"

"ఈ కాలం మగపిల్లలు ఊత్తరాలతో ఆగుతారా?" అన్నది కొంటెగా.

"ఏమయినా నాకు మీ వరస నచ్చలేదు".

"నాకూ మీ వరస నచ్చలేదు. చూస్తే ఈ శతాబ్దం ప్రవరాఖ్యుడిలా ఉన్నారు."

"..................."

"ఇంతకీ ఏమిటంటారూ?"అన్నది ఒకింత విసుగు చూపిస్తూ .

బిక్కమొగమే సమాధానం.

"సరే ఇంతవరకూ ఏమీ అనలేదు.నే ఒకటే అడుగుతాను సూటిగా నా కళ్లలోకి చూసి చెప్పండి, నేనంటే మీకు ఇష్టమేనా?"

ఆమె కళ్లలోకి చూడలేక ఇష్టమేనన్నట్లు తల ఊపాడు.

సిగ్నల్ రెక్క వంగింది, ఆమె పట్టుదల, ఇరువైపు పెద్దల అంగీకారం తో వారిద్దరూ ఒకటయారు. ఇద్దరు ఆడపిల్లలు. మామగారి పరపతితో ఉద్యోగం లో చేరాడు.

పెళ్లి అయినా తర్వాత కూడా అతని అభిప్రాయం లో (ఆడవారి విషయం లో) మార్పు రాలేదు. లలిత అతని అమాయకత్వాన్ని చూసి వరించిందేమో భర్త నడవడిక మీద ఆమెకు కొండంత నమ్మకం ఉండేది. అందువల్లే పురిటికి

రెండు సార్లు పుట్టింటికి వెళ్లినప్పుడు అటు మూడు నెలలు ,ఇటు మూడు నెలలు వెరసి ఆరేసి నెలలు పుట్టింట్లోనే ఉండేది. పైగా ఆడవాళ్ళతో మాట్లాడితేనే అపార్ధాలకు దారితీస్తోందేమోననే అతని మనస్తత్వాన్ని చూసి" మీరు భలేవారేనండి"అని పైకి గలగలా నవ్వినా మనసు ప్రశాంతంగా ఉండేది.

అందుకు ఒక దృష్టాంతం పెళ్ళయిన కొత్తలోనే జరిగింది.

లలిత స్నేహితురాలు శ్యామల వీళ్ళింటికి వచ్చింది."నమస్కారం మోహన్ గారూ" అంటూ అప్పుడే ఆఫీసు నుండి వస్తున్న లలిత భర్తను పలకరించింది.

" నమస్కారం"అని తడబడుతూ ప్రతి నమస్కారం చేసి అవతలి గదిలోకి వెళ్లిపోయాడు.

"అదేమిటే మీ ఆయన ఉలుకుపలుకు లేకుండా వెళ్లిపోయాడు. సిగ్గా ,భయమా లేక నువ్వు ఆయన్ని ..."అంటూ ప్రారంభించింది.

"అబ్బే అదేం కాదే. ఆఫీసు నుండి అలసటగా వచ్చారు. నిన్నెప్పుడో మా పెళ్లి లో చూడటమే కదా. సరిగా గుర్తు పట్టుండరు" అని సర్ది చెప్పి భర్త గదిలోకి వెళ్ళి

"మా శ్యాము వచ్చిందండీ" అన్నది,రుసరుసలాడుతూ

"ఆ " అని ఊరుకున్నాడు

"అదేమిటి మా శ్యామలతో మాట్లాడరా!".

"ఇది మరి బాగుంది. ఆవిడతో నాకేం మాటలుంటాయి?"

"మాట్లాడాలంటే బోలెడుంటాయి. కనీసం వాళ్ళ కుటుంబం గురించయినా అడగవచ్చు కదా. సినిమాలు, టివి కార్యక్రమాలు.... మాట్లాడాలంటే విషయాలే ఉండవా?"

"అవన్నీ ఆవిడతో ఎందుకు,నా కిష్టం ఉండదు."

"అవును లెండి. అదే మీ ఆఫీసులో ఆడవాళ్ళతో అయితే గంటల తరబడి మాట్లాడతారు" అన్నది భారతనారిలాగా ముక్కు తుడుచుకుంటూ.

స్నేహితురాలు ముందు తల కొట్టేసినట్లుగా ఉంది ఆమెకు.

"భలే దానివోయ్ నేను నీతోనూ, మా అమ్మతోనూ తప్ప మరెవరితోనయినా మాట్లాడటం నువ్వు ఎప్పుడయినా చూశావా!"

'హార్మోన్ డెఫీషియన్సీ' అంటూ నవ్వేసింది. అంతకు మించి ఇంకేమీ చేయలేకపోయింది. ఈ సంఘటనతో భర్త మీద ఆమెకు ఉన్న అభిప్రాయం ఇంకా బలపడిపోయింది. అది మార్చుకునే సందర్భం కానీ, అవసరం కానీ ఆమెకు

రాలేదు.ఈ రోజుల్లో 'ఇంకా ఇలాంటి వారు ఉన్నారా! ఉంటారు, నూటికో కోటికో ఒక్కరు ఇంకొక ఆడదాన్ని కనీసం కన్నెత్తయినా చూడనివాళ్లు, మా ఆయనలాగా' అని మురిసిపోయేది.

వాళ్ళ ఇద్దరు పిల్లలు పెద్ద వాళ్లవుతున్నారు. గౌను,స్కర్టు స్థాయి నుంచి నిలిచీ నిలవని చున్ని కాలేజీ స్థాయికి వచ్చేశారు. తమ వయసు పిల్లలతో స్నేహాలు, ఒకళ్ల ఇంటికి ఒకళ్ల రాకపోకలు జరుగుతున్నాయి. వయసు తెచ్చిన మార్పుతో మోహన్ కు ఇదివరకు లాగా మాట్లాడాలంటే బెరుకుతనం పోయి , ఇక మాట్లాడినా తప్పులేదు అని క్రమేపీ అనుకోవటం, అమలు చేయటం ప్రారంభించాడు. దానికి తోడు వచ్చే పిల్లలు కూడా అంకుల్ అంటూ మాట్లాడుతూ ఉండేవారు వాళ్ళ కాలేజీ సంగతులు,స్నేహితుల గురించి చెపుతుండేవారు.

కానీ ఈ మధ్య తమ తండ్రి వాలకం మోహన్ పెద్ద అమ్మాయికి నచ్చటం లేదు.

ఆ అమ్మాయి' మా నాన్న ఇదివరకే నయం ఎవరితోనూ మాట్లాడకుండా ఉండేవాడు. ఇప్పుడేమిటో వచ్చిన ప్రతివాళ్లతోనూ మాట్లాడేస్తున్నారు. ముఖ్యంగా మా ప్రమీలయితే మరీనూ చున్ని జారిపోయినా పట్టించుకోదు, సర్దుకోదు' అనుకోవటం ప్రారంభించింది.

ఒక రోజు ఉండబట్టలేక తన తల్లి దగ్గర ఈ ప్రస్తావన తెచ్చింది.

"అమ్మా నాన్నగారేమిటే ఇలా తయారయ్యారు?" అంటూ.

విషయం అర్థం కాని లలితమ్మ తెల్లబోయి చూసింది.

"నాన్న ఇదివరకే నయం.చక్కగా తన గదిలో కూర్చుని ఆయన పనులేమిటో చేసుకునేవారు. ఇప్పుడేమో మా ఫ్రెండ్సుతో మాట్లాడేస్తున్నారు. ఆ ప్రమీలయితే మరీనూ. నాన్న మీదపడి మాట్లాడేస్తుంది. నాన్న మారిపోతున్నారమ్మా. ఇదివరకు లాగా కాదు అందరు ఆడవాళ్ళతోనూ మాట్లాడేస్తున్నారు.నాన్న వరసేమీ బాగాలేదు" అని ఖచ్చితంగా చెప్పేసింది.

తల్లి తెల్లబోయింది. కొంతసేపటికి తేరుకుని,

" ఛ నాన్న చాలా మంచివారు. అటువంటివేమీ మనసులో పెట్టుకోకు. అయినా వాళ్ళనీ తన పిల్లలనుకుంటారు. మీ అందరిదీ ఒకే వయసుకదా" అని సర్దిచెప్పినా భర్త మీద తన అభిప్రాయం తో పాటు పిల్లలకు కూడా అభిప్రాయం ఏర్పడే వయసు వచ్చిందని అవగతమయింది.

COMMENTS